# తల్లి లేని పిల్ల

వేణుగోపాలరావు తొమ్మిదిన్నరకు భోంచేసి ఆఫీసుకి వెళ్ళటానికి ముందు కొంచెంసేపు బయటి గదిలోని వాలుకుర్చీలో కూర్చుని సిగరెట్టు కాల్చుకుంటూ ఉత్తరాలకోసం ఎదురు చూట్టం ఆయన నిత్య కార్యక్రమంలోని ఒక ముఖ్యభాగం. అప్పుడే అతను ఇంటికి సంబంధించిన అనేక సమస్యల్ని సింహావలోకనం చేసుకొని – వాటికి పరిష్కారమార్గాలు ఆలోచించి, ఆఫీసుకు బయలుదేరి వెళ్తాడు.

అలవాటు ప్రకారంగా వేణుగోపాలరావు భోంచేసి ముందుగదిలో సిగరెట్టు కాల్చుకుంటూ కూచున్న సమయానికే పోస్టుమన్ ఒక ఉత్తరం అందించి వెళ్ళాడు. కవరుమీదున్న రాతనుబట్టి ఉత్తరమెవరిదో వెంటనే అతనికి అర్థమయింది. సిగరెట్టును ఆఖరుసారిగాపీల్చి బయట పడేసి ఉత్తరం చించాడు. వేణుగోపాలరావు బావమరిది రాశాడు ఆ ఉత్తరం! వెంటనే అతనికి తనభార్యమీద పట్టరాని కోపం వచ్చింది. ఒక్క పరుగున వంటింటోకి పరుగెత్తాడు.

వేణుగోపాలరావు భార్య అప్పుడే నాలుగు పచ్చడి మెతుకులు ... గంజి — చారు గిన్నె అందుకోబోతున్నది. గడిచిన పదిరోజుల్నుంచి హిస్టీరియా జబ్బుతో బాధపడి ఇవ్వాళే కాస్త

కోలుకున్నది. ఇంకా పూర్తిగా ఆవిడ జబ్బు తగ్గి పోలేదు కూడాను! వేణుగోపాలరావు ఒక్క పరుగునవచ్చి - భార్యను ఒక్క తన్ను తన్నేడు. దాంతో ఆవిడ తినే తినే పళ్ళెంమీాదుగా బోర్లాపడింది. అందుకోబోతున్న చారుగిన్నె పళ్ళెంలోనే ఒలికి పోయింది. మజ్జిగపాత్ర, మంచినీళ్ళ చెంబూ, బోర్లాపడి శబ్దం చేసుకుంటూ దొర్లిపోయాయి. ఆవిడ లేవటానికి ప్రయత్నిస్తు న్నప్పుడే వేణుగోపాలరావు మళ్ళా ఆవిడ వీపుమీాద మరో తన్ను తన్ని 'మీా అన్నకు ఉత్తరం ఏమని రాశావు? ... ఈ ఉత్తరం చూడు, ఏం రాశాడో!' అని ఆ వుత్తరాన్ని ఆవిడ మొహానికేసి కొట్టి బయటి గదిలోకి వెళ్ళిపోయాడు.

మధ్యగదిలో చాపమీాద నిద్రబోతున్న వాళ్ళ పది నెలల ఆడపిల్ల ఈ హడావుడికి లేచి బిత్తరపోయి చూడసాగింది. వేణుగోపాలరావు మధ్య గదికీ, బయట గదికీ మధ్యవున్న తలుపు మూసేసి ముందు గదిలోని పడక కుర్చీలో దఢాలున కూచో బడ్డాడు.

ఇదివరలో ఎప్పుడూ ఆఫీసుకు వెళ్ళబోయేముందు ఇలాంటి ఘటన సంభవించలేదు! ఒకటి రెండుమార్లు ఏదో చిన్న విషయంమీాద భార్యతో పోట్లాడి ఆఫీసుకువెళ్తే.... అక్కడ ఏపనీ సక్రమంగా జరగలేదు! పట్టి పుణ్యానికే ఆఫీసు బాయ్ మీాద ఆవేళ కారాలు మిరియాలు నూరేడు! ఆఫీసరు— వేణుగోపాలరావును చీవాట్లు వేశాడు! ఆ తరువాత మళ్ళా ఎప్పుడూ ఆఫీసుకు వెళ్ళేముందు - వేణుగోపాలరావు భార్యతో పోట్లాడనేలేదు! ఆవిడ పసిపాపను చంకనేసుకొని వాకిట్లో నిల

బడి చిరునవ్వుతో భర్తను ఆఫీసుకు పంపించేది! కాని ఇంతటి అమానుషం ఇంతకు ముందెన్నడూ జరుగలేదు!

కుర్చీలో కూచున్న మరుక్షణాన వేణుగోపాలరావు తను చేయరాని పని చేసినట్లు బాధపడసాగాడు. తన బావమరిది 'డబ్బు కావలసి వచ్చినప్పుడెల్లా పెళ్ళాంచేత ఉత్తరాలు రాయించటానికి నీకు సిగ్గూ — ఎగ్గూ వుండనక్కర్లేదూ? అని రాసినంత మాత్రాన తనెందుకు ఉద్రేకపడి ఆవిడనలా హింసించాలి! 'మీ అన్నకు డబ్బు కొంత పంపించమని ఉత్తరం రాశావా!' అని శాంతంగా అడిగి వుండాల్సింది! తనచేత దెబ్బలుతిని ఎవరితో చెప్పుకుంటుంది? ఆవిడకు ఎవరున్నారు? తనెందుకిలా ప్రవర్తించాలి?' — వేణుగోపాలరావు పరి పరివిధాల ఆలోచించటం సాగించాడు.

*    *    *

వేణుగోపాలరావు గౌరవనీయమైన మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగి - కొద్ది ఆస్తిని పంచుకున్నాడు. పెళ్ళి చేసుకొని ఉద్యోగంలో చేరిన మొదట్లోనే - దగ్గర బంధువొకాయన వ్యాపారం నిమిత్తం తన వాటా అమ్మేసి డబ్బు సర్దమని అడిగితే - అయినకాడికి ఆస్తి అమ్మేసి - వచ్చిన డబ్బంతా ఆయన చేతిలో పోశాడు - తక్కువ వడ్డీకి. సంవత్సరం గడిచీ గడవకముందే ఆ బంధువు వ్యాపారంలో దెబ్బతిని దేశాల మీద పరారయ్యాడు. వేణుగోపాలరావు తన డబ్బు పోయినందుకు కాక - ఆ బంధువు తన ఐదుగురు బిడ్డల్నీ,

భార్యనూ బజారు పాలుచేసి పారిపోయినందుకు అధికంగా బాధ పడ్డాడు. ఇక వేణుగోపాలరావు మాత్రం ఏం చేస్తాడు? తన కొచ్చే చాలీ చాలని జీతం రాళ్ళ మీదనే ఆధారపడవలసిన అగత్యం ఏర్పడింది. ఆర్థికంగా రక రకాల బాధలకు లోన య్యాడు. అవసరాల్ని తగ్గించుకొని ఒక పురుగులాగా జీవితాన్ని లాక్కొస్తున్నాడు. అతనికున్న అభిలాషలూ, ఆకాంక్షలూ అన్నీ గాలిలో కలిసి పోయాయి. తను అనుకున్నది ఒక్కటీ పూర్తి కాలేదు ఉన్న దాంట్లోనే కాళ్ళు చాచుకొని కాలం గడుపు తున్నాడు.

ఇక వేణుగోపాలరావు భార్యను చూడబోతే — తల్లి లేని పిల్ల. 'నా' అనే వాళ్లు లేరు. ఎంత కష్టమొచ్చినా, ఏ జబ్బు చేసినా భర్త అధీనంలో పడి వుండాల్సిందే తప్ప మరో మార్గం లేదు. ఆవిడకున్న ఒక్కగాను ఒక్క అన్న ఎక్కడో ఢిల్లీ నగరంలో ఒక ఉన్నత పదవిలో వుండి తన కుటుంబం, తన సుఖం - తన లోకం తప్ప, తన చెల్లెలి విషయంలో రవ్వంత సహాయం చేయటానికి ముందుకు రాడు.

తన కెవరూ లేరని వేణుగోపాలరావు భార్య బాధపడేది. ఆఖరుకు ఆ బాధ మనోవ్యాధిగా పరిణమించింది. తత్ఫలితంగా ఆవిడ రోజు రోజుకు క్షీణించి శల్యమైపోయింది. తను క్షీణదశకు లోనవుతున్న కొద్దీ ఆవిడ బాధ మరింత అధికమవుతూ వుండేది— 'ఒకవేళ ఏ కారణంగానైనా తను చచ్చిపోతే ఈ పసిపిల్లగతి ఏమవుతుంది?' అని — ఏడుస్తూ కూర్చునేది ఒకోప్పుడు. ఈ మానసిక బాధతోనే ఆవిడ కృంగి కృశించి పోయింది. పర్యవ సానంగా చూస్తూ చూస్తూ వుండగానే - వంటింట్లోనో,

దొడ్లోనో — ఎక్కడబడితే అక్కడ నిల్చున్న పళంగానే కింద పడిపోయేది. నోటినుంచి నురుగు, నురుగుతోపాటు రక్తం వచ్చేది. ఆవిడలో బాధలు మిక్కుటమైనప్పుడల్లా ఈ విధంగా పడిపోతుండేది. తన భార్య అలా కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ, నేలమీద పడివుండగా - పది నెలల పసిపాప ఆమె వేపు అమాయకంగా చూస్తూ 'అమ్మా! అమ్మా!!' అనటం వేణుగోపాలరావు మూడు నాలుగు పర్యాయాలు చూచి ఎంతో బాధపడ్డాడు.

ప్రతిసారీ మూర్ఛ నుంచి తేరుకోవటం తోటే ఆవిడ వేణుగోపాలరావును ప్రాధేయపడేది. నా స్థితి ఇలా వుందని మా అన్నకు రాయండి.' అని! కాని వేణుగోపాలరావుకు తెలుసు. ఏమీ రాసీ ప్రయోజనం లేదని. కారణం: అతను కానీ కానీ చొప్పున ప్రోగుచేసి ప్రతి సంవత్సరం వాళ్ళవూళ్లో ఎకరం, ఎకరంన్నర భూమి చొప్పున కొని పారేయటం ఒక నియమంగా పెట్టుకున్నాడు. అందుకని 'నీ చెల్లెలిస్థితి ఇలా వున్నది సుమా!' అని వేణుగోపాలరావు రాయనేలేదు. చివరకు వేణుగోపాలరావు భార్యే స్వయంగా రాసింది. 'జబ్బుతో చచ్చిపోతున్నాను - కొంత డబ్బంటే పంపించు' అని.

వేణుగోపాలరావు - మొదటిసారి భార్యను డాక్టరుకు చూయించినప్పుడు - అరవై రూపాయలయ్యాయి. అదీ అతని మిత్రుడు రాఘవేంద్రం సర్దాడు. ఆ తరువాత ఉపశయించినట్లే ఉపశయించి మళ్ళా జబ్బుపడ్డప్పుడు ఒక ఆయుర్వేద డాక్టర్‌కు చూయించాడు - డబ్బుకు దడిసి. కాని ఆ డాక్టరు ఏ రోజు డబ్బు ఆ రోజు వసూలు చేసేపద్ధతి పెట్టేటప్పటికి — భార్యకు

చికిత్స చేయించటమే మానేశాడు. ఆ తరువాత ఒకటి రెండు పర్యాయాలు మూర్ఛలు వచ్చి—వాటంతటవి తగ్గిపోయాయి.

ఈ పరిస్థితిలో వున్నప్పుడు వేణుగోపాలరావు భార్య తనే వాళ్ళన్నకు ఉత్తరం రాసింది.

* * *

పది గంటలకల్లా ఇంటి నుంచి బయలుదేరి ఆఫీసుకు వెళ్ళాల్సిన వేణుగోపాలరావు ఇవ్వాళ అలాగే పడక కుర్చీలో కూచోని ఆలోచనలలో మునిగిపోయాడు. అతని హృదయం చుట్టూ అంతులేని వ్యధ అలుముకొని వుంది. ఇలాంటిస్థితిలో అతను ఒక్క అడుగుకూడా బయటికి వేయలేదు.

వేణుగోపాలరావు ఒక్కసారిగా కుర్చీలోంచిలేచిభార్య ఏం చేస్తున్నదో చూడాలనుకున్నాడు! కాని, ఎందుకో లోనికి వెళ్ళబుద్ధికాలేదు! కడుపులో దేవుతున్నట్లనిపించింది. తల గిరగిర తిరుగుతున్నది. ఎవరో కొంతమంది వ్యక్తులు తమచుట్టూ రానిల్చొని . . . 'ఆ తల్లిలేని పిల్లను అలా హింసించటం తగునా?' అని అడుగుతూ . . . బాకులతో చాకులతో పొడుస్తున్నట్లనిపించింది. కుర్చీలో నుంచి లేచినవాడు మళ్ళా కూర్చునితలరెండు చేతులలో పట్టుకొని కళ్లుమూసుకున్నాడు!

ఇంతలోనే కాళ్ళ జోడు చప్పుడు చేసుకుంటూ రాఘవేంద్రం లోనికి ప్రవేశించాడు. వేణుగోపాలరావు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచి నిల్చున్నాడు! రాఘవేంద్రం వేణుగోపాలరావు వేపుచూచివిస్తుపోయాడు! . . . కళ్లు ఎర్రబడివున్నాయి!

వళ్ళంతా చెమటలుపోసి — తొడుక్కున్న బట్టలు ముద్ద ముద్దయ్యాయి!

'ఏమిటి వేణూ, సంగతి?' అన్నాడు రాఘవేంద్రం.

'ఏమీ లేదు!' అన్నాడు వేణుగోపాలరావు - ముక్త సరిగా!

'రాజేశ్వరి ఆరోగ్యం ఎలావుంది?' అన్నాడు రాఘవేంద్రం!

'బాగానేవుంది!' అని వేణుగోపాలరావు సమాధానం చెప్పి - కూర్చోటానికి రాఘవేంద్రానికి కుర్చీ చూపిస్తూ తను ఒక స్టూల్ మీద కూచున్నాడు!

'సరేగాని ఒకవిషయం నీతో మాట్లాడి వెళ్దామని వచ్చాను! నీ కిష్టంలేని పనని నాకు తెలుసు; కాని నీదగ్గరకు రాక తప్పలేదు. అవతలవ్యక్తి నాకు చాలా కావలసినవాడు .. ఏమీలేదు— మీ ఆఫీసునుంచి ఒక కాన్ఫిడెన్సియల్ ఆర్డరకు సంబంధించిన భోగట్టా కాఫీకావాలి! ... ఆవ్యక్తి కొంత డబ్బుకూడా నాచేతి కిచ్చాడు—' అని రాఘవేంద్రం ఆ భోగట్టాకు సంబంధించిన కాగితమూ, ఐదురూపాయల నోట్లు తీసి వేణుగోపాలరావు చేతి కందించాడు.

వేణుగోపాలరావు మనస్సు అతికల్లోలంగా వున్నది. కాని దాన్ని మరచి పోయే నిమిత్తం - రాఘవేంద్రంతో ఆ విషయమై చాలా వివరాలు అడిగి తెలుసుకొని ఆఖరున- 'ఈపనిసానుకూలపట్టానికి ప్రయత్నిస్తాను! కాని నాకుడబ్బవసరంలేదు!' అని డబ్బు తిరిగిచ్చేశాడు.

'ఏం, ఎందు కక్కర్లేదు? నీతోటి గుమస్తాలంతా ఏదో పై పైఆదాయాలతో బతుకుతూంటే- మడిగట్టుకొని కూచో వాల్సిన అవసరం నీకేమొచ్చింది? నీమంచితనం నీకేవిధం గానూ సహాయ పట్టంలేదు! ఆ చాలీ చాలని జీతంతో నువ్వెన్ని ఇబ్బందులు పడుతున్నదీ నాకు తెలియనిది కాదు! భార్యాబిడ్డలతో పస్తులు పడుకుంటున్నావు! సరయిన తిండిలేక కట్టుకునేందుకు బట్టలులేక బాధపడుతున్నావు! నీ భార్యజబ్బు పడితే ఆవిడకు చికిత్సచేయించడానికి నీ దగ్గర చిల్లికానీ కన్పించ లేదు. నిజాయితీగా బ్రతకటంవల్ల నువ్వు సాముకున్న దేమిటో కాస్త చెప్పు? . . , ఇలా అంటున్నానని నువ్వేమీ అనుకోవద్దు. మెహర్బానీ కోసం నువ్వు నాకీపని చెయ్యనక్కర్లేదు!' అని అంటూ —'సరేవస్తా' నని రాఘవేంద్రం లేచి బయటికి బయలు దేరాడు!

అలా బయలుదేరి వాకిలి దాటబోయే సమయానికి రాఘవేంద్రానికి లోపల్నుంచి ఏదో శబ్దంవిన్పించింది. గిరుక్కున రాఘవేంద్రంలోని కొచ్చి తలుపు తెరిచాడు, ఆదృశ్యం చూచి అతని కళ్ళవెంట ఒక్కసారిగా అనుకోకుండా అశ్రుధార ప్రవ హించింది. రాజేశ్వరి వంటింట్లో సగం తిన్న అన్నం పళ్ళెం పక్కగా పడి కాళ్ళూ, చేతులూ కొట్టుకొంటున్నది. పాత్రలన్నీ చెల్లా చెదురుగా పడివున్నాయి. నోటినుంచి నురుగు, రక్తం ప్రవహిస్తున్నాయి! తల ఒకవేపుకు తిరిగిపోతున్నది. కనుగుడ్లు అతి వేగంగా కొట్టుకుంటున్నాయి.

పది నెలల వాళ్ళ పసిపాప తల్లికాళ్ళ దగ్గర కూచోని అతి చిత్రంగా తల్లిని పరిశీలిస్తూ మధ్యమధ్యన ఏడుస్తున్నది.

ఒక్కసారిగా రాఘవేంద్రం హృదయం దహించుకుపోయింది. వేణుగోపాలరావు మీద కోపంకూడా వచ్చింది. గబగబా వెళ్ళి ఏడుస్తున్న పిల్ల నెత్తుకొని –' రాజేశ్వరికి ఎలావున్న దంటే. బాగున్నదన్నావు ఇదేనా ?' అన్నాడు రాఘవేంద్రం. వేణుగోపాలరావు మారుమాట్లాడలేదు.

'సరే – ఇదిగో ఈ డబ్బు తీసుకో. వెంటనే 'నర్సింగ్ హోమ్' లో చేర్పించు. నా విషయంలో నువ్వేమీ సాయపడ నక్కరలేదు.'– అన్నాడు రాఘవేంద్రం.

రాజేశ్వరి కాసేపటికి లేచి కూచున్నది. ఆ తరువాత మరికొంత సేపటికి రాఘవేంద్రం వెళ్ళిపోయాడు.

* * *

ఆ రెండో రోజు రాజేశ్వరిని 'నర్సింగ్ హోమ్' లో చేర్పించటంలో రాఘవేంద్రంకూడా చాలా సాయపడ్డాడు. ఆ తరువాత వేణుగోపాలరావు రోజుటి మాదిరిగానే ఆఫీసుకు వెళ్ళాడు. ఆఫీసుకు వెళ్ళాడన్న మాటేగాని — అతని మనస్సు రక రకాలైన ఆలోచనలతో నిండివుంది. ఏపనీ చేయ బుద్ధి పుట్టలేదు. . .'భార్య జబ్బుపడితే చికిత్స చేయించటానికి తనదగ్గిర తాహతులేదు. తను సరైన తిండి తినటం లేదు. బట్టలు అతి

జాగ్రత్తగా వాడుకుంటున్నాడు...అవును, రాఘవేంద్రం అన్నట్లు తనమంచితనం ఏ విధంగానూ తనకు ఉపయోగపడలేదు !...'

రక రకాలుగా ఆలోచించిన మీదట వేణుగోపాలరావు రాఘవేంద్రం అడిగిన కాన్ఫిడెన్షియల్ ఆర్డర్ కాపీచేసి ఇచ్చే విషయంలో ప్రయత్నించటానికే తీర్మానించుకొని — ఆ డిపార్ట్మెంట్ హెడ్ క్లర్క్‌ను లంచ్ టైంలో కలుసుకొని కొంత ఆశ చూపించాడు. ఆఫీసరుకూడా ఆ రోజు లేనందున - ఐదుగంటల తరువాత ఈ విషయంలో ప్రయత్నం చేయటానికి అతడు మాట ఇచ్చాడు.

లంచ్ టైంలోనే వేణుగోపాలరావు దానికి సంబంధించిన కాగితం హెడ్ క్లర్క్ చేతికివ్వటం చేత — ఐదు గంటలకు ఆ ఫైల్‌తో ఆయన రెడీగా ఉన్నాడు. ఆఫీసులోవున్న వాళ్ళంతా ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. హెడ్ క్లర్క్ రాత్రి ఎనిమిదింటి[illegible]కా వుండటం అలవాటు గనుక ఎవరూ పట్టించుకోలేదు. ఆఫీసు బాయ్ ఒక్కడు మాత్రం మిగిలాడు. హెడ్ క్లర్కూ వేణుగోపాలరావు దూరంగా వున్న ఒక హోటలుకెళ్ళి కాఫీ, టిఫిన్ తెమ్మని అతన్ని పంపించి - ఆ ఆర్డరు కాపీ చేయటంలో ఉభయులూ నిమగ్నమయ్యారు.

పదిహేను నిమిషాలు గడిచాయో లేదో - ఆఫీసరు టూంర్ నుంచి వచ్చేశాడు. వెంట నలుగు రైదుగురు క్లర్కులున్నారు. రెండున్నర పేజీల 'కాన్ఫిడెన్షియల్ ఆర్డర్' కాపీ చేయటంలో ఇద్దరూ మహాతొందర పడుతున్నారు. కాపీ పట్టుబడి పోయారు.

ఆర్డర్ ఫైలూ వాళ్లు కాపీచేసిన కాగితాలు తీసుకొని ఆఫీసరు వాళ్ళను తన గదిలోకి పిలిచాడు. తక్కిన క్లర్కులు కూడా అక్కడే వున్నారు.

వేణుగోపాలరావును ఈ సంఘటన మరింత కలవర పరిచింది. 'తన ఉద్యోగం పోతుంది, జైలు శిక్షకూడా అనుభవించటానికి సిద్ధమే - చేసింది తప్పుగనుక. కాని వణకుతూన్న హెడ్ క్లర్కు స్థితిని తలచుకొని అమిత బాధపడ్డాడు. అతనికి పన్నెండేళ్ళ సర్వీసు వున్నది. ఐదారుగురు పిల్లలు. పెళ్ళికి ఎదిగిన ఆడపిల్లలుకూడా వున్నారట. అతని ఉద్యోగం పోతే అతని కుటుంబం స్థితి ఏం గాను? వేణుగోపాలరావు పరి పరివిధాల బాధపడ్డాడు.

ఆఫీసరు కళ్ళారా ఈ సంఘటన చూచినందున 'డిపార్టుమెంటల్ ఎంక్వైరీ' అంటూ వేరే జరిపించకనే చార్జి షీటు దాఖలు చేయటం జరిగిపోయింది.

* * *

ఈ విషయం ఆఖరుకు రాఘవేంద్రానికికూడా తెలిసింది. పరుగెత్తుకుంటూ వేణుగోపాలరావును కలుసుకున్నాడు. తన విషయంలో ప్రయత్నించటం వల్లనే వేణుగోపాలరావు ఈ చిక్కుల్లో పడిపోయాడని గ్రహించి చాలా విచారించాడు. తనకు చేతనయింది చేయటానికి చూచాడు. కాని ఏమీ లాభించలేదు.

'ఈ విషయాలేవీ రాజేశ్వరికి తెలియనీయకోకు.' అని వేణుగోపాలరావు రాఘవేంద్రంతో చెప్పాడు.

'అదంతా నేను చూస్తాలే' అని రాఘవేంద్రం వేణుగోపాలరావుకు హామీ ఇచ్చాడు. పైగా తన ప్రేరేపణ మూలంగానే - వేణుగోపాలరావు ఈ పనికి పూనుకున్నందున రాఘవేంద్రం - రాజేశ్వరి ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్త తీసుకోవాలసిన బాధ్యత తన మీద ఎంతైనా వున్నదని భావించాడు

'తల్లీ పిల్లా జాగ్రత్త' అన్నాడు వేణుగోపాలరావు కంట తడి బెట్టుకుంటూ.

'నువ్వు దిగాలు పడాల్సిన అవసరం లేదు!'— అని సమాధాన పరచాడు — రాఘవేంద్రం.

రాఘవేంద్రం వేణుగోపాలరావు దగ్గిర్నుంచి నేరుగా 'నర్సింగ్ హోమ్' దగ్గరకొచ్చాడు - రాజేశ్వరిని చూచేందుకు. కాని రాఘవేంద్రం అక్కడకు చేరే ముందే ఒక ఘోరం జరిగిపోయింది. రాజేశ్వరి పక్క గదిలోవున్న ఒకావిడ — 'మీ ఆయన ఏదో ఆఫీసు కాగితాలు దొంగిలించటంచేత ఉద్యోగం పోయిందనీ, జైలు శిక్ష అనుభవించ బోతున్నాడనీ, చెప్పగా రాజేశ్వరి ఈ వార్త విని తట్టుకోలేక - చూస్తూ చూస్తూండగానే ప్రాణాలు వదిలింది. అప్పటికే అంతులేని మానసిక వ్యథతో బాధపడుతూ అతి దుర్భలంగా వున్నందున-ఈవార్త వినటంతో ప్రాణాల్నే పోగొట్టుకున్నది రాజేశ్వరి.

రాఘవేంద్రం వచ్చేటప్పటికి జనం చుట్టూ మూగి వున్నారు. కన్ను మూసిన రాజేశ్వరి పక్కన పది నెలల పసిపాప కూచోని తల్లి మొహంవేపు దీక్షగా చూస్తున్నది. అక్కడ మూగిన వాళ్ళంతా 'పాపం — తల్లి లేని పిల్ల' అని సాను భూతి చూపిస్తున్నారు. రాఘవేంద్రం ఈ దృశ్యం చూచి ఒక్కసారిగా కూలబడి పోయాడు.

* * *